అదుపు తప్పి కారు బీభత్సం

వంకాయగూడెం శివారులో బైక్, ఆటోలను ఢీకొట్టి బోల్తాపడిన ఇన్నోవా కారు

- ఎదురుగా వస్తున్న బైక్, ఆటో, టాటా ఏస్ వాహనాలకు ఢీకొని బోల్తా
- ఇద్దరికి తీవ్ర, మరో నలుగురికి స్వల్ప గాయాలు

శంకరపట్నం, మార్చి 6: మండలంలోని వంకాయగూడెం వద్ద గురువారం సాయంత్రం అదుపు తప్పిన ఓ ఇన్నోవా బీభత్సం సృష్టించింది. ఎదురుగా వస్తున్న రెండు వాహనాలను ఢీకొనడంతో ఓ వ్యక్తి పరిస్థితి విషమంగా మారగా, మరో వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఇంకో నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన గుడిపాటి భూపాల్‌రెడ్డి గురువారం తన ఆరుగురు కుటుంబ సభ్యులతో కలిసి సొంత ఇన్నోవా కారులో కరీంనగర్‌లో జరిగిన బంధువుల పెళ్లికి హాజరై తిరిగి వెళ్తున్నారు. శంకరపట్నం మండలం వంకాయగూడెం వద్దకు రాగానే ప్రధాన రహదారిపై కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ఓ ప్యాసింజర్ ఆటో, టాటా ఏస్ వాహనాలను వేగంగా ఢీకొని గాల్లోకి లేచి పల్టీలు కొడ్తూ రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ క్రమంలో ప్యాసింజర్ ఆటో మరో బైక్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ప్యాసింజర్ ఆటో నుజ్జు నుజ్జు అయింది. ఆటో డ్రైవర్ మానకొండూర్ మండలం గంగిపల్లి గ్రామానికి చెందిన మార రమేశ్‌కు, బైక్‌పై వస్తున్న శంషాబాద్ గ్రామానికి చెందిన డొల్ల సతీశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. టాటా ఏస్ వాహనంలో డ్రైవర్‌తో పాటు స్కూల్ నుంచి కరీంనగర్ ఇంటికి వెళ్తున్న ముగ్గురు టీచర్లు ఉండగా డ్రైవర్ పెర్క రాజమల్లుకు గాయాలయ్యాయి. కాగా సకాలంలో కారులో బెలూన్లు తెరుచుకోవడంతో పలువురికి ప్రాణాపాయం తప్పగా నలుగురు స్వల్ప గాయాలతో బైట పడ్డారు. మార రమేశ్, డొల్ల సతీశ్‌ను 108 వాహనంలో కరీంనగర్ దవాఖానకు, తాడికల్ గ్రామానికి చెందిన పెర్క రాజమల్లును మరో 108 వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఇన్నోవా, టాటా ఏస్ వాహనాల్లో ప్రయాణిస్తున్న వారికి ప్రథమ చికిత్స చేసి ఇతర వాహనాల్లో గమ్యస్థానాలకు పంపించారు. పోలీసులు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. డ్రైవర్ నిద్ర మత్తులో కారు నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు తెలుస్తున్నది.

ప్రేమ జంట ఆత్మహత్య

- కరీంనగర్‌లో విషాదం
- మృతులిద్దరిది చొప్పదండి మండలం

దవాఖాన ఆవరణలో రోదిస్తున్న అలేఖ్య కుటుంబ సభ్యులు, బంధువులు

అలేఖ్య, అరుణ్‌కుమార్ (ఫైల్)

కరీంనగర్, మార్చి 6 (నమస్తే తెలంగాణ) : ఓ ప్రేమ జంట ఆత్మహత్య చేసుకుంది. కలిసి నడుద్దామనుకున్న ఆ ప్రేమికులు ఏడడుగులు వేయకుండానే అనంత లోకాలకు చేరారు. పెద్దలు తమ పెళ్లికి అంగీకరించరనే అనుమానంతో ఒకే గదిలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. కరీంనగర్‌లోని వావిలాలపల్లిలో వెలుగు చూసిన ఈ విషాద ఘటన కలకలం రేపింది. కరీంనగర్ త్రీ టౌన్ పోలీసులు, మృతుల బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చొప్పదండి మండలం చిట్యాలపల్లికి చెందిన కొండపర్తి అరుణ్‌కుమార్ (24), ఇదే మండలం భూపాలపట్నానికి చెందిన నాంపెల్లి అలేఖ్య (21) కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. వరుసకు బావా మరదళ్లు కూడా అయిన వీరు దగ్గరి బంధువులు కూడా. అలేఖ్య తను అరుణ్‌కుమార్‌ను ప్రేమించే విషయాన్ని తన కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకెళ్లింది. ఈ విషయాన్ని అరుణ్‌కుమార్ పెద్దనాన్న కొడుకు, అలేఖ్య సొంత అక్క భర్త అయిన కుమారస్వామి ఈ విషయాన్ని అరుణ్ తల్లిదండ్రులకు దృష్టికి తీసుకెళ్లాడు. తమ కొడుకు ఇంకా ఉద్యోగంలో స్థిరపడలేదని, తర్వాత ఆలోచిద్దామని అరుణ్ తల్లి దండ్రులు చెప్పడంతో కొంత కాలంగా ఈ విషయంలో స్తబ్ధత ఏర్పడింది. అయితే, ఇటీవల అలేఖ్యకు వేరే అబ్బాయితో పెళ్లి సంబంధం కుదిర్చారు. అలేఖ్య తనకు ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని మనస్తాపానికి గురైంది. త్వరలో పెళ్లి కూడా నిశ్చయించడంతో

క్షణిక ఆవేశంతోనేనా..?

వరుసకు బావా మరదళ్లు కూడా అయిన అరుణ్‌కుమార్, అలేఖ్య గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. అలేఖ్య అక్క అరుణ్‌కుమార్ సొంత పెద్ద నాన్న కుమారుడి భార్య, ఈ రకంగా వీరిద్దరూ బంధువులే. అయితే అలేఖ్యను పెళ్లి చేసుకుంటాననే విషయం అరుణ్‌కుమార్ తన తల్లి దండ్రుల ముందు చెప్పలేక పోయినట్లు తెలుస్తున్నది. అలేఖ్య తన తల్లి దండ్రులకు తన ప్రేమ విషయాన్ని కొంత కాలం కిందనే చెప్పగా, అరుణ్‌కుమార్ పెద్ద నాన్న కొడుకు అయిన కుమారస్వామి తన చిన్నాన్న చిన్నమ్మల దృష్టికి తీసుకెళ్లారు. తమ కొడుకు ఉద్యోగంలో స్థిర పడిన తర్వాత పెళ్లి చేస్తామని వారు చెప్పిన నేపథ్యంలో అలేఖ్య, అరుణ్‌కుమార్ దూర దూరంగానే ఉంటున్నట్లు తెలుస్తున్నది. ఇరు కుటుంబాల మధ్య ఏం జరిగిందో ఏమోగాని అలేఖ్యకు పెళ్లి సంబంధం చూడడం, వేరే అబ్బాయితో వివాహం నిశ్చయంకావడంతో అలేఖ్య, అరుణ్‌కుమార్ మనస్తాపానికి గురైనట్లు తెలుస్తున్నది. ఇద్దరూ ఒకే కులానికి చెంది, వరుసైన వారు కూడా కావడంతో కాస్తంత చొరవ తీసుకుంటే ఇద్దరి పెళ్లి జరిగేదని, క్షణికావేశంలో నిండు ప్రాణాలు తీసుకున్నారని బంధువులు రోదించడం కనిపించింది.

మరింత కుంగి పోయిన అలేఖ్య కాలేజీ నుంచి సర్టిఫికెట్లు తీసుకొని వస్తానని చెప్పి బుధవారం కరీంనగర్‌కు వచ్చింది. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ చేసి ఉంది. వెంటనే కరీంనగర్ వచ్చిన కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా కనిపించలేదు. అనుమానం వచ్చి అరుణ్‌కుమార్‌కు ఫోన్ చేయగా అతడు లిఫ్ట్ చేయలేదు. కాగా, కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో అరుణ్ కుమార్ ల్యాబ్ టెక్నిషియన్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఇంటి నుంచి కరీంనగర్ చేరుకున్న అలేఖ్య హాస్పిటల్లో ఉన్న అరుణ్ కుమార్‌ను కలుసుకున్నది. అక్కడి నుంచి అరుణ్‌కుమార్ వావిలాలపల్లిలోని తన అద్దె ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ ఏం జరిగిందో ఏమోగాని తెల్లవారే సరికి ఒకే గదిలో వేర్వేరు ప్యాన్లకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అయితే రాత్రి కరీంనగర్‌లో వెతికి ఇంటికి వెళ్లిన అలేఖ్య కుటుంబ సభ్యులు గురువారం ఉదయం అరుణ్‌కుమార్ ఉండే అద్దె ఇంటి అడ్రస్ తెలుసుకుని అక్కడికి వచ్చి చూడగా లోపలి నుంచి గడియ వేసి ఉంది. ఎంత పిలిచినా ఫలితం లేకపోయే సరికి వెంటిలేటర్స్ నుంచి చూడగా అరుణ్‌కుమార్, అలేఖ్య విగత జీవులై కనిపించారు. వెంటనే 100 డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న త్రీ టౌన్ పోలీసులు శవాలను వైద్య పరీక్షల కోసం స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న అరుణ్‌కుమార్, అలేఖ్య కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో దవాఖానకు చేరుకున్నారు. ఇరు కుటుంబాల రోదనలు మిన్నంటాయి.. కాగా అలేఖ్య తల్లి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ సీఐ జాన్ రెడ్డి తెలిపారు.

ఫీజు చెల్లింపునకు గడువు 13

కమాన్‌చౌరస్తా, మార్చి 6 : ఎస్‌యూ పరిధిలో బీఫార్మసీ, ఎంఈడీ పలు సెమిస్టర్ల ఫీజు చెల్లించేందుకు ఈ నెల 13 ఆఖరు తేదీ అని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సురేశ్ కుమార్ ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుము రూ.300తో 18వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని సూచించారు.

పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి

చొప్పదండి, మార్చి 6: పట్టణ ప్రజలు 2024-25 ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను, నీటిపన్ను, లైసెన్స్ ఫీజు, అడ్వర్టైజ్మెంట్ ఫీజు బకాయిలు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ, 2024-25 ఆర్థిక సంవత్సరం ఈనెల 31తో ముగుస్తున్నా కొంతమంది బకాయిదారులు నేటి వరకు పన్నులు చెల్లించలేదని తెలిపారు. బకాయిదారులు సకాలంలో పన్నులు చెల్లించాలని కోరారు.

డాక్టర్ స్వర్ణలతకు సన్మానం

విద్యానగర్, మార్చి 6 : జాతీయ దంత వైద్యుల దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డెన్ శాతవాహన ఆధ్వర్యంలో గురువారం అనన్య హాస్పిటల్ దంత వైద్యురాలు కుతూరి స్వర్ణలతను ఘనంగా సన్మానించారు. ఆమెతో పాటు దంత వైద్యులు బద్దం సత్యనారాయణరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మానువాడ శంకర్, ననువాల గిరిధర్‌రావు, అకెనపల్లి అజయ్‌కుమార్, రాములు, గోనె చంద్రారెడ్డి, మానస, శ్రావణి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై ప్రజల్లో పూర్తి వ్యతిరేకత

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక్క స్థానం గెలవకపోవడమే ఇందుకు నిదర్శనం • మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్

చిగురుమామిడి, మార్చి 6: అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో పూర్తిగా వ్యతిరేకత ఏర్పడిందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక్క స్థానంలో కూడా గెలువకపోవడమే దీనికి నిదర్శనమని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొడితల సతీశ్ కుమార్ పేర్కొన్నారు. ఎన్నికల్లో అసలు పోటీ కూడా చేయని బీఆర్ఎస్ వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్రీపాల్ రెడ్డిని బలపరిచి నెగ్గించుకో గలిగిందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచి ఉంటే అన్ని స్థానాలను క్లీన్ స్వీప్ చేసేదని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో సమస్యలపై పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పైన ఉన్న వ్యతిరేకత ఎన్నికల్లో బీజేపీకి కలిసి వచ్చిందని తెలిపారు. విధానపరమైన నిర్ణయం కారణంగా బీఆర్ఎస్ పోటీలో లేకపోవడంతో ఓటరు అని వార్యంగా బీజేపీ వైపు మొగ్గు చూపారన్నారు. రాబోయే స్థానిక సంస్థలకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలని సతీశ్‌కుమార్ ఓ ప్రకటనలో కోరారు.

కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవో నాయకులు

కొత్తపల్లి, మార్చి 6 : జిల్లాలో మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించి జిల్లాకు పేరు తెచ్చినందుకు టీఎన్జీవో నాయకులు గురువారం కలెక్టర్ పమేలా సత్పతిని కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఈ నెల 8న మహిళా దినోత్సవం సందర్భంగా వేడుకలను నిర్వహించుకునేందుకు మహిళా ఉద్యోగులకు అనుమతి ఇవ్వాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టీఎన్జీవోల జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణరావు టీజీవోల జిల్లా అధ్యక్షుడు మడిపల్లి కాళీచరణ్, మహిళా నాయకులు శారద, సబిత, రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మీందర్‌సింగ్ తదితరులున్నారు.

మండల విద్యాధికారి విచారణ

గంగాధర,మార్చి 6: మండలంలోని మధురానగర్‌లోని సురభి పాఠశాలలో 2వ తరగతి విద్యార్థి సమీర్‌కుమార్‌ను టీచర్ చితకబాదిన ఘటనపై మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్‌రావు గురువారం విచారణ జరిపారు. విద్యార్థులతో మాట్లాడగా, టీచర్ కొట్టమంటేనే తాము సమీర్ కుమార్‌ను చెంపపై కొట్టినట్లు విద్యార్థులు చెప్పారని ఎంఈవో తెలిపారు. దీనిపై డీఈవో జనార్దన్ రావు ఫోన్‌లో మాట్లాడారని, చిన్నారులకు విద్యా బుద్ధులు నేర్పవలసిన ఉపాధ్యాయులు విచక్షణారహితంగా కొట్టడం ఏంటని ప్రశ్నించారని ఏంఈవో తెలిపారు. వెంటనే సదరు టీచర్‌ను విధుల నుంచి తొలగించాలని, పాఠశాలలో మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు.

అర్హతగల అధ్యాపకులకు గైడ్ షిప్ అవకాశం ఇవ్వాలి

కమాన్‌చౌరస్తా, మార్చి 6 : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేసే అర్హతగల రెగ్యులర్ అధ్యాపకులందరినీ పీహెచ్‌డీ పర్యవేక్షకులుగా గుర్తించి పరిశోధన అవకాశాలు కల్పించాలని టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేందర్ రెడ్డి అధ్యర్యంలో ఉపకులపతి ఆచార్య యు ఉమేశ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వీసీని కలిసిన వారిలో టీజీసీటీజీఏ శాతవాహన యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ కే మల్లారెడ్డి, కరీంనగర్ జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాస్, సంఘ బాధ్యులు డాక్టర్ టి. శ్రీనివాస్, ఎస్. రమేశ్ బాబు ఉన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ పరీక్షలు

కమాన్‌చౌరస్తా/మానకొండూర్/ మానకొండూర్ రూరల్, మార్చి 6 : ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 58 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, మొదటి రోజు 15,639 మంది విద్యార్థులకు గానూ 15,282 మంది హాజరు కాగా, 357 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పలు పరీక్ష కేంద్రాలను డీఐఈవో జగన్‌మోహన్ రెడ్డి, అధికారులు పరిశీలించారు. మానకొండూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 100 మంది విద్యార్థులకు గానూ మొత్తం మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కే రాజేశ్వర్‌రావు తెలిపారు. దేవంపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 107 మంది విద్యార్థులకు 104 మంది హాజరయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం వెల్లడించారు.

అనుమానాస్పద స్థితిలో కానిస్టేబుల్ మృతి

రుద్రవరం రాజు (ఫైల్)

విద్యానగర్, మార్చి 6 : కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రేకుర్తిలో స్పెషల్ యాక్షన్ టీం కానిస్టేబుల్ రుద్రవరం రాజు (47) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అయితే మృతి విషయంలో తన కోడలు లావణ్యపై అనుమానం వ్యక్తం చేస్తూ రాజు తల్లి రుద్రవరం సుగుణ ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మానకొండూర్ మండలం వెల్దికి చెందిన రాజు స్పెషల్ యాక్షన్ టీం కానిస్టేబుల్‌గా పని చేస్తూ కుటుంబంతో కలిసి రేకుర్తిలో ఉంటున్నాడు. అనారోగ్య కారణాలతో కొద్ది రోజులుగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న రాజును చూసేందుకు బుధవారం తన చిన్న కొడుకు రేకుర్తిరాగా, తన కోడలు తల్లిదండ్రులు, కోడలు రాజును చూడనీయకుండా గొడవ పడ్డారని, మరుసటి రోజైన గురువారం తన కొడుకు మరణ వార్త తెలిసిందని మృతుడి తల్లి సుగుణ పోలీసులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నది. తన కొడుకు చనిపోతే అతడి ఉద్యోగం వస్తుందని ఆశించి తన కోడలు చంపి ఉంటుందనే అనుమానం వ్యక్తం చేసింది. తన కోడలు, ఆమె తల్లిదండ్రులతోపాటు మరో కానిస్టేబుల్‌పై అనుమానం ఉన్నట్లు సుగుణ ఫిర్యాదు చేయడంతో పోలీసులు పోస్టుమార్టం కోసం శవాన్ని కరీంనగర్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. కాగా, కానిస్టేబుల్ రాజుకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఓడిపోయినా ప్రజాక్షేత్రంలోనే ఉంటా..

మాట్లాడుతున్న నరేందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, మార్చి 6 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను ఓడిపోయినప్పటికీ నైతిక విజయం తనదేనని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్వాల్ రెడ్డి పేర్కొన్నారు. ఓడిపోయినా ప్రజాక్షేత్రంలోనే ఉంటానని తెలిపారు. క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి తనపై మరింత బాధ్యతను పెంచిందని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ వాదిగా పార్టీలో మరింత చురుకుగా పనిచేస్తానని తెలిపారు. కరీంనగర్ కాంగ్రెస్ పార్టీలో నాయకత్వ లోపం స్పష్టంగా కనబడుతున్నదని, పార్టీ ప్రక్షాళనకు తనవంతుగా కృషి చేస్తానని వెల్లడించారు. చెల్లుబాటు కానీ 11శాతం 28,686 ఓట్లు తన ఓటమికి కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు సోషల్ మీడియా వేదికగా చేసిన విష ప్రచారాన్ని పట్టభద్రులు పట్టించుకోలేదని ఓటర్లు మాత్రం తనకు మద్దతు పలికారని వెల్లడించారు. ఎన్నికలకు ముందు 42 నియోజకవర్గాల్లో పట్టభద్రులకు ఇచ్చిన హామీల అమలుకు రేపటి నుంచే తన కార్యాచరణ ఉంటుందని, అవసరమైతే సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. కాంగ్రెస్‌లో లోటుపాట్లపై పార్టీ పెద్దలకు నివేదిక ఇస్తానని, పార్టీలో స్తబ్ధత నెలకొన్నదని, శ్రేణులను ఉత్సాహ పరిచేందుకు కృషి చేస్తానన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ అధికార దుర్వినియోగం

మాట్లాడుతున్న యాదగిరి శేఖర్‌రావు

తెలంగాణచౌక్, మార్చి 6: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన యాదగిరి శేఖర్‌రావు ఆరోపించారు. నగరంలోని ప్రెస్‌భవనంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల బరిలో నుంచి తప్పుకోవాలని కాంగ్రెస్ నాయకులు ఒత్తిడి తీసుకొచ్చారని తెలిపారు. వారి ఒత్తిళ్లకు తలవంచకుండా పోటీలో ఉన్నందుకు కుట్రపూరితంగా కాంగ్రెస్, బీజేపీ నాయకులు తమ ఓటర్ల వద్దకు వెళ్లి ప్రలోభాలకు గురిచేసి డబ్బుతో ఓట్లను కొన్నారన్నారు. ట్రస్మా సంఘం నాయకులను ఫోన్ ద్వారా బెదిరించి తమ వైపు తిప్పుకొన్నట్లు ఆరోపించారు. జాతీయ పార్టీ పేరు చెప్పుకొని పోటీ చేసిన అభ్యర్థులు డబ్బుతో ప్రలోభాలకు గురిచేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి ఓటర్లకు నగదు, గూగుల్, ఫోన్ పే ద్వారా డబ్బులు పంపిణీ చేశారని ఆరోపించారు. ఈ చెల్లింపులపై ఎన్నికల సంఘం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ఖర్చు చేయకుండా నిబద్ధతతో ఎన్నికలో పోటీ చేసిన తాను నైతికంగా విజయం సాధించినట్లు తెలిపారు. ప్రజాపక్షవాదిగా ప్రజల్లో ఉంటూ ఎన్నికల్లో పట్టభద్రులకు ఇచ్చిన వాగ్దానాల అమలుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు సాధనకు సహకరించాలి

కార్పొరేషన్, మార్చి 6: స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఏటా నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో ఈ ఏడాది కరీంనగర్ నగరపాలక సంస్థ మెరుగైన ర్యాంకు సాధించేందుకు నగర ప్రజలు సహకరించాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ కోరారు. నగరంలోని హౌసింగ్‌బోర్డులో పర్యటించి స్వచ్ఛత పనులను పరిశీలించారు. డివిజన్ల వారీగా మీటింగ్‌లు ఏర్పాటు చేసి స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. నగర ప్రజలు పరిశుభ్రతను పాటించి.. ఇంట్లోని చెత్తను సెగ్రిగేషన్ చేసి కార్మికులకు అందించి నగరపాలక సంస్థకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏఈ సతీశ్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ స్వామీ, సిబ్బంది పాల్గొన్నారు.

కిట్స్‌ోజెన్-25 పోస్టర్ ఆవిష్కరణ

హుజూరాబాద్ టౌన్, మార్చి 6: సింగాపూర్ గ్రామంలోని కిట్స్ కళాశాలలో ఈ నెల 20, 21 తేదీల్లో కిట్స్‌ోజెన్-25 పేరిట నిర్వహించబోయే క్రీడా, సాహిత్య, సాంస్కృతిక ఉత్సవాల వాల్ పోస్టర్‌ను హుస్నాబాద్ మాజీ శాసనసభ్యుడు, కిట్స్ సెక్రటరీ పొడితెల సతీశ్ కుమార్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఉత్సవాల్లో రాష్ట్రంలోని వివిధ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. కళాశాల డైరెక్టర్ కే శంకర్ మాట్లాడుతూ.. ఈ ఉత్సవాలను ప్రతి రెండు సంవత్సరాలకోసారి నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల రిజిస్ట్రార్ డాక్టర్ వీ రాజేశ్వర్ రావు, సమన్వయకర్తలు డాక్టర్ సునీత, రాజు, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎల్‌బీసీ ఘటనపై విచారణ జరిపించాలి

తెలంగాణచౌక్, మార్చి 6: శ్రీశైలం ఎడమగట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ) ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, టన్నెల్ ప్రమాదంలో మరణించిన కార్మికులకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు, గాయపడిన వారికి రూ.25లక్షల చొప్పున పరిహారం అందించాలన్నారు. ఎస్ఎల్‌బీసీ పనులు నిర్లక్ష్యంగా చేపట్టిన సదరు కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలన్నారు.

కొత్తపల్లి రైల్వే గూడ్స్ షెడ్డులో సౌకర్యాలు కల్పించాలి

ముకరంపుర, మార్చి 6: కొత్తపల్లి రైల్వేస్టేషన్‌లో అన్ని సౌకర్యాలతో పూర్తి స్థాయిలో రైల్వే గూడ్స్ షెడ్డు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించాలని కరీంనగర్ డిస్ట్రిక్ట్ రైల్వే హ్యాండ్లింగ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది లక్ష్మీనారాయణ, కార్యదర్శి అబ్దుల్ సమద్ నవాబ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. కరీంనగర్‌లోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన కరీంనగర్ డిస్ట్రిక్ట్ రైల్వే హ్యాండ్లింగ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయాన్ని గురువారం అసోసియేషన్ లీగల్ అడ్వైజర్ మధుసూదన్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ... కొత్తపల్లిలో పూర్తి స్థాయిలో షెడ్డును అందుబాటులోకి తెచ్చిన తర్వాతే కరీంనగర్ గూడ్స్ షెడ్డు మూసివేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు బోయినపల్లి నర్సింగరావు, కోశాధికారి పోకల రవి, ఉపాధ్యక్షులు తొడుపునూరి కరుణాకర్, కాచం రవీందర్, చింతకింది శ్రీనివాస్, సయ్యద్ షర్ఫుద్దీన్, సహాయ కార్యదర్శి సురేశ్ తదితరులున్నారు.

శ్రీనివాస పాఠశాల స్థలాన్ని గురుకులానికి కేటాయించాలి

హుజూరాబాద్, మార్చి 6: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని శ్రీనివాస ఇంగ్లిష్ మీడియం పాఠశాల స్థలాన్ని గురుకుల పాఠశాలకు కేటాయించాలని నవతెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేశ్ కోరారు. గురువారం జమ్మికుంట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1980వ సంవత్సరంలో జమ్మికుంట గ్రామపంచాయతీ పాలకవర్గం స్థానిక విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని 647 సర్వే నంబర్‌లోని రెండెకరాల భూమిని శ్రీనివాస ఇంగ్లిష్ మీడియం పాఠశాల వ్యవస్థాపకుడు కాంతారావుకు 35 సంవత్సరాల లీజుతో కేటాయించిందని తెలిపారు. దురదృష్టవశాత్తు కాంతారావు మరణించిన తర్వాత పాఠశాల మూతపడిందని, సదరు స్థలం కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకొని, ప్రభుత్వ పాఠశాలకు కేటాయించాలని కోరారు.

‘ధన్గర్‌వాడీ’ విద్యార్థికి కలెక్టర్ పరామర్శ

కమాన్‌చౌరస్తా/విద్యానగర్, మార్చి 6 : మంకమ్మతోటలోని ధన్గర్‌వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతూ కోతి వస్తున్న దన్న భయంతో మొదటి అంతస్తు నుంచి దూకిన బాలుడిని కలెక్టర్ పమేలా సత్పతి గురువారం పరామర్శించారు. కొద్ది రోజుల క్రితం 8వ తరగతి విద్యార్థి రఘువర్ధన్ పాఠశాలలో ఉండగా, కోతి రావడంతో మొదటి అంతస్తు ను